# మంచుతెర

సుమిత్ర అంత ఖచ్చితంగా మాట్లాడుతుందని నిర్గుణరావు అనుకోలేదు. అంత నిర్భయంగా నిర్ణయాలు తీసుకోగలదనీ అతనూహించలేదు. ఆఫీసులో కూర్చుని పనైతే చేస్తున్నాడు కాని అతని మనసంతా ఇంటిపైనే ఉంది.

'ఎంత ఖచ్చితంగా మాట్లాడింది! భర్త అని కూడా చూడకుండా మాట్లాడింది' ఉక్రోషంగా అనుకున్నాడు నిర్గుణరావు.

ఆమె అలా మాట్లాడుతుందని తెలిసినా సరే నిర్గుణరావు ఆమెతో అలానే మాట్లాడేవాడు. ఎందుకంటే భర్తమాట భార్య విని కచ్చితంగా ఆచరించాలనే మగ మనసు వున్న వ్యక్తి అతను. అసలు విషయం ఏమిటంటే...

నిర్గుణరావు స్టేట్ గవర్నమెంట్ ఉద్యోగి. అతని భార్య సుమిత్ర. సుమిత్రకి పద్దెనిమిదో ఏటనే ఇతనితో వివాహం అయింది. వివాహం అయిన నాలుగేళ్లకి ఇద్దరు పిల్లల తల్లి అయింది. పాప సంధ్య, బాబు సుమన్. వివాహంతో ఆగిపోయిన చదువుని ఆమె ప్రైవేట్‌గా చదివి పూర్తిచేసింది. టైప్, షార్ట్‌హాండ్ నేర్చుకుంది. ఆమెకి ఓ ప్రైవేట్ కంపెనీలో స్టెనోగా ఉద్యోగం వచ్చింది.

'నీ కెందుకు ఉద్యోగం?" అడిగాడు నిర్గుణరావు.

"ఇంట్లో కూర్చుని నేనేం చేయాలండీ? ఉద్యోగం చేస్తాను" అందామె.

"ఇంటిపని చెయ్యాలి, వంటపని చేయాలి. నన్ను ఆఫీసుకు పంపించాలి, పిల్లలని స్కూల్‌కి పంపించాలి. వాళ్ల హోమ్ వర్క్ ఎలా చేస్తున్నారో చూడాలి. ఇన్ని బాధ్యతలు, ఇంత పని ఉండగా ఇంట్లో ఖాళీగా కూర్చునేటట్టు ఉద్యోగం చేస్తానంటా వేంటి? నీకు ఆర్థికపరమైన ఇబ్బందులు లేవుకదా" అన్నాడు నిర్గుణరావు.

"మీరూ పిల్లలు ఉండగానే నా ఇంటిపని, వంటపని అయిపోతుందండీ, తర్వాత ఖాళీగా కూర్చోవటమే. ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని కాదు, నేనూ సంపాదించగలననీ కాదు. నా తృప్తి కోసం నేనీ ఉద్యోగం చేస్తానంటున్నాను" నెమ్మదిగా చెప్పిందామె.

"నువ్వు ఉద్యోగంలో తప్పక రాణిస్తావ్. అందులో సందేహమేం లేదు. కాని నాకు నీ సమయం పూర్తిగా పిల్లల కోసం, నా కోసం వినియోగిస్తే తృప్తిగా ఉంటుంది" అన్నాడతను.

సుమిత్రకి ఉద్యోగం చేయాలనే కోరిక ఉంది. అందుకు తగిన అర్హత ఉంది. అవసరమైన ఉత్సాహం ఉంది. అయినా ఆమె భర్త మాటకి విలువనిచ్చి ఉద్యోగంలో చేరలేదు.

ఇది జరిగి చాలాకాలం అయింది.

నిర్గుణరావు తల్లిదండ్రులు స్వగ్రామంలో ఉన్నారు. వాళ్లకి నిర్గుణరావు పెద్ద కొడుకు. రెండవ కొడుకు సుందరరావు విశాఖలో ఉద్యోగం చేస్తున్నాడు.

సుమిత్ర తల్లిదండ్రులు పల్లెలో ఉన్నారు. వాళ్లకి సుమిత్ర ఒక్కగానొక్క సంతానం. పొలం మీద వచ్చే పంట వాళ్ల జీవనాధారం. సుమిత్ర తండ్రి అనారోగ్యవంతుడు. ఎప్పుడూ ఏదో ఒక నొప్పితో బాధపడేవాడు. పల్లెల్లో సరైన వైద్య సదుపాయం లేదని పట్నంలో పెద్ద డాక్టర్‌కి తండ్రిని చూపిస్తే బాగుండు ననుకుంది సుమిత్ర.

"నాన్నగారిని రమ్మని రాస్తానండీ" అంది సుమిత్ర.

"ఎందుకు?"

"డాక్టర్‌కి చూపిద్దామండీ"

"ఇప్పుడా?"

"అంటే?"

"ఇప్పుడెలా కుదురుతుంది?"

"ఒంట్లో నలతగా ఉన్నప్పుడే కదండీ చూపించాలి!" చిత్రంగా భర్తనే చూస్తూ అందామె.

"ఆయనతో హాస్పిటల్ చుట్టూ ఎవరు తిరుగుతారు? నాకు లీవ్ దొరకదు" అన్నాడతను.

"నేను వెళతాను".

"నువ్వా? తిరిగి తిరిగి నువ్వు అలిసిపోయి మంచం ఎక్కితే నీకిక్కడెవడు సేవలు చేస్తాడు?" చికాకుగా అన్నాడు నిర్గుణరావు.

ఆమె మనసు చివుక్కుమంది. తాను ఒక్కగానొక్క కూతురైనందుకు, తనేమాత్రం తండ్రి ఆరోగ్యం బాగుచేయించే అవకాశం లేకపోయినందుకు ఆమె బాధపడింది. కాని భర్తని సాధించి, సతాయించి తండ్రికి వైద్యం చేయించాలని మాత్రం ఆమె ప్రయత్నించలేదు. తండ్రి అనారోగ్యం ప్రాణాపాయం కలిగించేది కాదని తెలుసు. ఇదిజరిగి కొంతకాలం అయింది.

"రేపు మా అమ్మా, నాన్నా వస్తున్నారు" అన్నాడు నిర్గుణరావు.

"ఉత్తరం వచ్చిందాండీ?"

"లేదు స్టేషన్‌కి వెళ్లమని తమ్ముడు ఫోన్ చేశాడు".

అత్త, మామగార్లని సుమిత్ర ఆప్యాయంగా ఆహ్వానించింది. వాళ్లు ఇంట్లోకి అడుగు పెడుతూనే త్వరత్వరగా స్నానాలు ముగించారు. సుమిత్ర టిఫిన్ అందించింది.

"వద్దు" అంది అత్తగారు.

"ఏం?"

"హాస్పిటల్‌కి వెళ్లాలి".

"ఏంటి సుస్తీ?" ఆత్రంగా అడిగింది సుమిత్ర.

"అనారోగ్యం ఏం లేదమ్మా. అంతా వాడి చాదస్తం. మాకే రోగం లేదంటున్నా వినకుండా మాస్టర్ చెకప్ చేయిస్తానని ఊదరకొట్టి లాక్కొచ్చాడు" అందామె.

"ఎవరు?"

"నీతో చెప్పలేదా? ఇంకెవరూ నిర్గుణే" అందామె నవ్వుతూ.

నిర్గుణరావు లీవ్ పెట్టి తల్లిదండ్రులని హాస్పిటల్‌కి తీసుకు వెళ్లాడు. సుమిత్ర చాలా నిర్లిప్తంగా అతనివైపు చూసింది.

ఆమె కళ్లముందు ఎప్పుడూ ఏదో ఒక సుస్తీతో బాధపడ తండ్రి రూపం కదిలింది.

"నిర్గుణరావు తల్లిదండ్రులు ఉంటూంది పల్లెలో కాదు. అన్ని సదుపాయాలూ ఉన్న ఊళ్లోనే ఉంటున్నారు. వైద్య సదుపాయం ఉంది. వాళ్లిద్దరికీ ఏ అనారోగ్యం లేదు. అయినా వాళ్లని పిలిపించి మాస్టర్ చెకప్ చేయిస్తున్నాడు. వైద్యుని సలహా అవసరమైన తన తండ్రిని డాక్టర్‌కి చూపిస్తానంటే నిరాకరించాడు. అతనికి తన తల్లిదండ్రులు ఎంతో, తనకి తన తల్లిదండ్రులూ అంతే కదా! ఈ విషయం అతనికి తెలియదా?" అనుకుందామె.

ఈ సంఘటన ఈ మధ్యనే జరిగింది.

వారం రోజుల క్రితం రాత్రి భోజనం చేస్తూ నెమ్మదిగా "నాన్నగారు పెద్దవాళ్లైపోయారు. మన దగ్గరకి వచ్చేయమని రాశాను. రేపాదివారం వెళ్లి అక్కడి వ్యవహారాలు చూసి వాళ్లని ఇక్కడికి తీసుకొస్తాను" అన్నాడు నిర్గుణరావు.

"అలాగే తీసుకురండి" అందామె.

ఆ రాత్రి తండ్రికి ఆరోగ్యం బాగులేదని సుమిత్రకి టెలిగ్రామ్ వచ్చింది.

అర్ధరాత్రి వెళ్లటం కుదరదు కాబట్టి ఫస్ట్ బస్‌కి వెళ్లాలని నిశ్చయించుకుందామె.

"ఆఁ ఏం వెళతావులే! ఆయనకి ఎప్పుడూ ఏదో ఒక సుస్తీయేగా?" నిరాసక్తంగా అన్నాడు నిర్గుణరావు.

ఆమె అతని మాటలు పట్టించుకోకుండా "నాతో అమ్మా, నాన్నని తీసుకొస్తానండీ, వాళ్లు పెద్దవాళ్లయ్యారు. ఒంటరిగా ఆ పల్లెలో ఎందుకండీ? ఆరోగ్యాలూ అంతంత మాత్రమే" అందామె.

అతను అదిరిపడ్డాడు. "వాళ్లని తీసుకొస్తావా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఆఁ"

"ఎలా తీసుకొస్తావ్?"

"బస్సులో" అమాయకంగా అందామె.

"ఇక్కడ వాళ్లు ఎలా వుంటారు?" ఆశ్చర్యంగా అడిగాడు.

"మనతో"

"మనతో ఎలా వుంటారు?" చికాకుగా అడిగాడు.

"ఎలా ఉండడమేంటి?" అయోమయంగా అందామె.

"అల్లుడింట్లో ఎలా వుంటారు?"

"అత్త మామల్లా" నవ్వుతూ అందామె.

అతని ప్రశ్న ఆమెకి అర్థమై పోయింది. అయినా బయటపడలేదు.

"నీకేమయినా మతిపోయిందా? కూతురింట్లో ఏ తల్లిదండ్రులైనా ఉంటారా?" విసుగ్గా అన్నాడతను.

"కొడుకుల్లేని తల్లిదండ్రులు ఉంటారు"

"పిచ్చిపిచ్చిగా మాట్లాడకు. వాళ్లిక్కడెలా ఉంటారు?"

"చూడండి వాళ్లకి కొడుకులు లేరు. నేనొక్కదాన్నే సంతానం. ఆ విషయం మీకు తెలుసు. వృద్ధాప్యంలో ఒంటరిగా వాళ్లెలా బ్రతుకుతారు? నా తల్లిదండ్రులని అనాధల్లా నే నొదిలేయలేను. వాళ్లని చూడటం నా బాధ్యత మాత్రమే కాదు, కూతురుగా నేను ఋణం తీర్చుకోటానికో చిన్న అవకాశం" అందామె.

"నే వాళ్లని పోషించలేను".

"నేను ఉద్యోగం చేస్తాను. అయినా వాళ్లు ఆర్థికంగా మనపైన పెద్దగా ఆధారపడరండీ. వాళ్లకి కాస్త రాబడి ఉంది" సుమిత్ర అంది.

"ఆ డబ్బు ఎవడి ముఖానైనా కొట్టి వాళ్లని చూడమను".

"సుమిత్ర అతనివైపు పరిశీలనగా చూసింది.

ఇదేం మనిషి? ఎందుకిలా నా విషయంలో ప్రవర్తిస్తాడు? అతని భార్యని నేను. అతని తల్లిదండ్రులని నేనెంత అభిమానిస్తాను, గౌరవిస్తాను. అతను మాత్రం తన తల్లిదండ్రుల గురించి అసలు పట్టించుకోడు ఎందుకని?

సుమిత్రకి నిజంగా మతిపోయింది. ఎవరైనా కూతురింట్లో ఉంటారా? ఎంత తప్పు! ఎంత అప్రతిష్ట? ఇంత పరువు తక్కువ పనులు చేస్తానంటుందేంటి? తను తన తల్లిదండ్రులని తీసుకొస్తానని చెప్పాడు. ఆమెకి అది ఇష్టం లేదా? అందుకే పంతం పట్టి తను తన తల్లిదండ్రలని తీసుకొస్తానంటోందా? ఆలోచిస్తూనే – "ఎట్టి పరిస్థితుల్లోనూ వాళ్లని తీసుకు రావడానికి వీల్లేదు" అన్నాడు నిర్గుణరావు.

సుమిత్రకి ఓపిక నశించింది అతని అర్థరహిత వాదన ఆమెకి చికాకుని తెప్పించింది.

"అత్తయ్య, మామయ్యలని తీసుకు రావద్దని నేను అనొచ్చు. మీ తమ్ముడి దగ్గర ఉండమనో, వాళ్ల ఊళ్లోనే ఉండమనో నేనూ సలహా ఇవ్వవచ్చు. అయినా నేను అనను. వాళ్లు రావటం వల్ల ఇంట్లో పని ఎక్కువైనా, ఆర్థిక ఇబ్బందులు ఏర్పడినా నేను వాళ్లు మనతోనే ఉండాలని అంటాను. ఎందుకంటే వృద్ధాప్యంలో వాళ్ల ధైర్యం, తోడు పిల్లలేనండీ. రేపు మనం వృద్ధుల మవుతాం. మన పిల్లలు మనల్ని అలా దూరంగా వుంచితే భరించగలమా? మన ప్రవర్తన ప్రభావం పిల్లలపైనా ఉంటుంది. ఈరోజు సున్నితమైన బంధాలు, అనుబంధాలు మనం వారి అనుభవంలోకి తీసుకు రాకపోతే వాళ్లు మనలను ఏ వృద్ధుల ఆశ్రమం చేరమంటారు. మీరు ఒప్పుకోడానికి ప్రయత్నించండి. మీరు ఒప్పుకున్నా, ఒప్పుకోక పోయినా అమ్మా, నాన్నని నేను నాదగ్గరే ఉంచుకుంటాను. ప్రశాంతంగా ఆలోచించి నిర్ణయించుకోండి" అంది సుమిత్ర.

"నన్నే ఎదిరిస్తున్నావు? నాకే నీతులు చెప్తున్నావా?" కోపంగా అన్నాడు నిర్గుణరావు.

"ఎదిరించటమే నా లక్ష్యం అయితే చాలాకాలం క్రితమే ఉద్యోగంలో చేరేదాన్ని. మీకు నీతులు బోధించటమే నా అభిమతమైతే నాన్నగారిని ఏనాడో ఇక్కడ హాస్పిటల్లో చూపించేదాన్ని. తల్లిదండ్రుల ఆస్తిలో హక్కును అనుభవించే మాకు, వాళ్ల బాధ్యతలు కూడా స్వీకరించే మనసుండాలండీ. కొడుకులు లేనంతమాత్రాన వాళ్లు ఒంటరిగా బ్రతకక్కర్లేదండీ" అందామె.

"నేనొప్పుకోకపోతే?"

"నేను తీసుకొస్తాను".

"ఎలా తీసుకొస్తావ్? ఇది నా ఇల్లు" గర్వంగా అన్నాడతను.

"ఇన్నాళ్లూ మన ఇల్లు అనే అనుకున్నాను. మీరీరోజు 'నా ఇల్లు' అని నొక్కి చెప్పారు. మీ ఇంటికి తీసుకురాను. నా ఇంటికి తీసుకు వెళతాను" స్పష్టంగా అందామె.

"పిల్లల విషయంమరిచిపోతున్నావా?"

ఆమె సన్నగా నవ్వి "పిల్లలు మరీ పసివాళ్లు కాదు. ఆలోచించే స్థాయికి ఎదిగినవాళ్లే. వాళ్లకి స్పష్టంగా మనిద్దరి సంభాషణా చెప్తాను. మనిద్దరిలో ఎవరిదగ్గర ఉంటారో వాళ్లనే నిశ్చయించుకోమంటాను. వాళ్లిష్టం" అందామె.

"ఇదే నీ నిర్ణయమా?"

"ఆఁ"

ఆడదానికింత పొగరా? కూడదనుకున్నాడు నిర్గుణరావు. క్రితంరోజు రాత్రి పిల్లలిద్దరికీ నిర్గుణరావు ఎదురుగానే విషయం వివరించింది సుమిత్ర. వాళ్లిద్దరూ ఈరోజు సాయంత్రం వాళ్ల నిర్ణయాన్ని చెప్తారు.

తల్లిని సమర్థిస్తారా? తనని సమర్థిస్తారా? ఆలోచిస్తున్నాడు నిర్గుణరావు.

ఆఫీసు అవగానే ఇంటికి బయలుదేరాడు. వరండాలో వాలు కుర్చీలో కూర్చుని పేపర్ చదువుకుంటున్న తండ్రిని చూసి ఆశ్చర్యపోయాడు నిర్గుణరావు.

హాల్లో సంధ్యకి జడవేస్తున్న తల్లిని "ఎప్పుడొచ్చారు?" అని ఆశ్చర్యంగా అడిగాడు.

"గంటైంది" అందామె.

"ఎలా వచ్చారు?"

"స్టేషన్ నుంచి సుమిత్ర తీసుకొచ్చింది" అన్నాడు నిర్గుణరావు తండ్రి.

"సుమిత్రకి మీరొస్తున్నట్లు తెలుసా?"

"ఆఁ తనింట్లో పాలు పొంగించడానికి రమ్మని రాసింది. వచ్చాం" అంది తల్లి.

"తనిల్లేంటి?" ఆశ్చర్యంగా అడిగాడు నిర్గుణరావు.

"ఇది నీఇల్లు. ఎన్నాళ్లు నీ ఇంట్లో ఉంటుంది? తనింట్లోకి వెళ్లాలి కదా?" అంది తల్లి.

నిర్గుణరావుకి తల తిరిగిపోయింది.

ఇదేంటి? సుమిత్ర, ప్రతి విషయం తల్లిదండ్రులకి చెప్పింది. పిల్లలవైపు చూశాడు.

వాళ్లిద్దరూ ఏం నిర్ణయించుకున్నారో అతనికి అర్థం కాలేదు.

రాత్రి ఎనిమిది గంటలకి సుమిత్ర అందరికీ భోజనం వడ్డించింది.

"ఆఫీసుకు ఇల్లు దగ్గరేనా అమ్మా?" అడిగాడు నిర్గుణరావు తండ్రి సుమిత్రని.

"పది నిమిషాల నడకండి"

"సుమిత్రకి అప్పుడే ఉద్యోగం దొరికిందా?" అనుకున్నాడు నిర్గుణరావు.

"మీరిద్దరూ ఏం నిర్ణయించుకున్నారు?" అడిగింది సుమిత్ర పిల్లలని.

"మేం హాస్టల్‌లో వుంటాం. సెలవుల్లో కొన్నాళ్లు నీ దగ్గరా, ఇంకొన్నాళ్లు నాన్నగారి దగ్గర ఉంటాం. మా ఫీజులు ఇద్దరూ సమానంగా భరించండి" అంది సంధ్య.

"అమ్మ నిర్ణయం, వాదన మాకు చాలా నచ్చాయి. కాలానుగుణంగా నాన్నగారిలో మార్పు రానందుకు బాధగా వుంది. ఇది వాళ్లిద్దరి సమస్య. వాళ్లిద్దరి నిర్ణయాలకి అడ్డు రావటం మా ఇద్దరికీ ఇష్టం లేదు. ఇద్దరూ మా ఇద్దర్నీ ప్రేమించేవాళ్లే. ఎవరినో ఒకరినే కోరుకోవటం మా ఇద్దరికీ అంగీకారం కాదు. అందుకే మేమిలా నిర్ణయించుకున్నాం" అన్నాడు సుమన్.

"కోడలు తీసుకున్న నిర్ణయం మాకు నచ్చింది. వృద్ధాప్యంలో, తల్లిదండ్రుల్ని పిల్లలే చూడాలి. కొడుకైనా, కూతురైనా పిల్లలు పిల్లలే. ప్రపంచం ఎంతో అభివృద్ధి చెందింది అంటారు. ఏం అభివృద్ధో ఏమిటో? ఆడపిల్ల తల్లిదండ్రుల బాధ్యత తీసుకోవటం ఏమిటని ప్రశ్నించే స్థాయిలో నేటి పురుషులు ఉంటుంటే ఈ ప్రపంచం సాధించిన అభివృద్ధి ఏమిటో అర్థం కావటంలేదు" అన్నాడు తండ్రి.

"నేను కొన్నాళ్లు నీ దగ్గరా, కొన్నాళ్లు కోడలి దగ్గరా వుంటాను" అంది నిర్గుణరావు తల్లి.

"నేనో?" అడిగాడు నిర్గుణరావు తండ్రి.

"మీ ఇష్టం" అందామె.

"నేనూ నీతోపాటే" అన్నాడతను.

ఇదంతా వింటున్న నిర్గుణరావుకి మతిపోతోంది. తల తిరుగుతున్నట్టనిపించింది.

ఏమిటీ మనుషులు! ఎంత స్వతంత్రంగా నిర్ణయాలు తీసేసుకుంటున్నారు? తన పిల్లలు - తన పిల్లలేనా? ఎంత వివరంగా తమ నిర్ణయాన్ని తెలియజేశారు.

వాళ్లందరి ముందూ తనకి తనే అల్పంగా తోచాడు. సుమిత్ర, తల్లిదండ్రులు కలిసి ఉండటం తనకెందుకు అభ్యంతరం? మంచుతెరలా అస్పష్టంగా అతనిలో ఏర్పడిన ఓ మూర్ఖపు అభిప్రాయం తొలగించే ఆలోచన అతనిలో మొదలైంది.

ఆడపిల్ల ఇంట్లో ఉండటమా? చాలాకాలంగా తనలో పాతుకుపోయిన అభిప్రాయం. ఇది వీళ్లందరిలో ఎందుకు లేదు? తనలోనే ఎందుకుంది? వాళ్లందరి ఆలోచనాస్థాయి పెరిగిందా?

'అత్తమామలు తన దగ్గర ఉండటానికి వీల్లేదన్నాడట. కొడుకుల్లేని వాళ్లు కూతురింట్లో ఉంటే తప్పా? ఎక్కడుంటారు చెప్పు! వీడు ఒప్పుకోలేదని భార్య వేరేవెళ్లి తల్లిదండ్రులతో ఉంటోంది. పిల్లలు హాస్టల్లో జాయినయ్యారు. కొడుకింటికి, కోడలింటికీ తిరుగుతున్నారతని తల్లిదండ్రులు, మూర్ఖత్వం కాకపోతే అత్తమామలని పరాయివాళ్లలా భావించటం ఏంటి? మతి లేనట్టుంది' అంటూ జనం నవ్వుతున్న అనుభూతి నిర్గుణరావులో.

'సుమిత్ర నా భార్య. ఆమె తల్లిదండ్రులు నాకు పరాయివాళ్లెలా అవుతారు?' అనుకున్నాడు.

"సుమిత్రా! బట్టలు సర్దు. రేపు ఫస్ట్ బస్‌కి వెళ్లి అత్తయ్య, మావయ్య గార్లని తీసుకొద్దాం. మనం వచ్చేవరకు పిల్లల దగ్గర అమ్మా వాళ్లుంటారు" అన్నాడతను.

*• ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 28, మార్చి 1990 •*